

భగీరథ మహర్షి జయంతి కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి

భగీరథ మహర్షి ఆశయ సాధనకు కృషిచేయాలి

- ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్ రెడ్డి

వనస్థలిపురం, మే 14 (ఆంధ్రజ్యోతి): భగీరథ మహర్షి ఆశయ సాధనకు సగర కులస్థులు కృషి చేయాలని ఎల్‌బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి అన్నారు. భగీరథ మహర్షి జయంతిని హరిణ వనస్థలి పార్కులో మంగళవారం ఘనంగా నిర్వహించారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఆయన మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ సోదరభావంతో ముందుకు సాగాలని సూచించారు. కార్యక్రమంలో భాస్కర్ సాగర్, సగర సంఘం సభ్యులు లక్ష్మీనారాయణ, శ్రీను, రాఘవ, నాగరాజు, చిన్న, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

దుర్గానగర్‌లో..

చంపాపేట: దుర్గానగర్‌కాలనీలో భగీరథ మహర్షి జయంతిని మంగళవారం నిర్వహించారు. భగీరథ మహర్షి విగ్రహానికి పలువురు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో సగర సంఘం అధ్యక్షుడు అమరేందర్‌సాగర్, కార్యదర్శి ముత్యాల వెంకటేష్, సగర సంఘం నాయకులు కె.భాస్కర్, బి.యాదయ్య, యం.భాస్కర్, ఎస్.గోవిందుసాగర్, నర్సింహసాగర్, రమేష్, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

కౌంటింగ్ పూర్తయ్యే వరకూ అప్రమత్తంగా ఉండాలి

- టీపీసీసీ ప్రచార కమిటీ చైర్మన్ మధుయాష్కీ గౌడ్

వనస్థలిపురం, మే 14 (ఆంధ్రజ్యోతి): ఎన్నికల కౌంటింగ్ పూర్తయ్యే వరకు డివిజన్ అధ్యక్షులు, పోలింగ్ ఏజెంట్లు అప్రమత్తంగా ఉండాలని టీపీసీసీ ప్రచార కమిటీ చైర్మన్ మధుయాష్కీగౌడ్ అన్నారు. లోక్‌సభ ఎన్నికల పోలింగ్ ముగిసిన నేపథ్యంలో ఎల్‌బీనగర్ నియోజవర్గంలో 11డివిజన్ల ఇన్‌చార్జిలు, డివిజన్ అధ్యక్షులతో వనస్థలిపురంలో పార్టీ కార్యాలయంలో మంగళవారం ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పార్లమెంట్ ఎన్నికలు ప్రారంభమైనప్పటి నుంచి ముగిసే వరకు కార్యకర్తలు ఎంతో కష్టపడి పనిచేసిన వారందరికీ అభినందనలు తెలిపారు. పోలింగ్ ప్రకియ ముగిసిందని నిర్లక్ష్యం వహించరాదని, అసలు ప్రక్రియ అంతా కౌటింగ్ వరకు కొనసాగుతుందన్నారు. కౌటింగ్ ప్రక్రియకు సంబంధించి ఏజెంట్ల నియామకం, పాసులు తీసుకోవడం, పోలీస్ వెరిఫికేషన్ తదితర ప్రక్రియను డివిజన్ల ఇన్‌చార్జిలు, అధ్యక్షులు పూర్తి చేయాలని సూచించారు. కార్యక్రమంలో కార్పొరేటర్ సుజాత నాయక్, ఎన్నికల చీఫ్ ఏజెంట్ చలకాని వెంకట్, మాజీ కార్పొరేటర్ వజీర్ ప్రకాశ్‌గౌడ్, టూరిజం కార్పొరేషన్ మాజీ చైర్మన్ ఉప్పల శ్రీనివాస్‌గుప్తా, తులసి శ్రీనివాస్, కుట్ల నర్సింహయాదవ్, సదాశివుడు తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ దళిత మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శిగా భాస్కర్



సరూర్‌నగర్, మే 14 (ఆంధ్రజ్యోతి): బీజేపీ దళిత మోర్చా రంగారెడ్డి జిల్లా కమిటీ ప్రధాన కార్యదర్శిగా బడంగ్‌పేట్‌కు చెందిన కుంటె భాస్కర్ నియమితులయ్యారు. ఈ మేరకు మోర్చా జిల్లా అధ్యక్షుడు జ్ఞానేశ్వర్ మంగళవారం నియమక ఉత్తర్వులు జారీ చేశారు. ఈ సందర్భంగా భాస్కర్ మాట్లాడుతూ.. పార్టీ పటిష్టానికి తనవంతు కృషి చేస్తానన్నారు.

టీపీసీసీ ప్రచార కమిటీ రాష్ట్ర కో-ఆర్డినేటర్‌గా దుర్గారెడ్డి



కె.దుర్గారెడ్డిని సన్మానించిన టీపీసీ సేవాదళ్ రాష్ట్ర అధ్యక్షుడు జితేందర్

చంపాపేట, మే 14 (ఆంధ్రజ్యోతి): టీపీసీసీ ప్రచార కమిటీ రాష్ట్ర కో-ఆర్డినేటర్‌గా కె. దుర్గారెడ్డి నియమితులయ్యారు. మంగళవారం కర్మన్‌ఘాట్‌లో టీపీసీ సేవాదళ్ రాష్ట్ర అధ్యక్షుడు మిద్దెల జితేందర్, పలువురు కాంగ్రెస్ పార్టీ నాయకులు ఆయనను సన్మానించారు. ఈ సందర్భంగా జితేందర్ మాట్లాడుతూ.. పార్టీ అభివృద్ధికి అందరూ కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో రంగారెడ్డి జిల్లా అధికార ప్రతినిధి బద్రీనాథ్, నాయకులు సురేందర్, తోకటి కిరణ్ తదితరులు పాల్గొన్నారు.



వైద్య శిబిరంలో పాల్గొన్న వయో వృద్ధులు తదితరులు

ఉచిత వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి

వనస్థలిపురం, మే 14 (ఆంధ్రజ్యోతి): ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ రంగారెడ్డి జిల్లా శాఖ ఆధ్వర్యంలో నాగోల్‌లో కో-ఆపరేటివ్ బ్యాంక్ కాలనీలో ఏర్పాటు చేసిన ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. ఈ సందర్భంగా వయోవృద్ధులకు బీపీ, షుగర్ తదితర వైద్య పరీక్షలు చేసి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. రెడ్ క్రాస్ చైర్మన్ ఎస్.నర్సింహా రెడ్డి మాట్లాడుతూ.. వయో వృద్ధుల సౌకర్యార్థం ఏర్పాటు చేసే ఉచిత వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో డాక్టర్ వి. పాండుగౌడ్, చల్లా రాఘవ రెడ్డి, మురళీధర్, శరత్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

టెట్ పరీక్ష రాసే అభ్యర్థులకు టి-సాట్ మెలకువలు

హైదరాబాద్ సిటీ, మే 14 (ఆంధ్రజ్యోతి): టీఎస్పీఎస్సీ ఆధ్వర్యంలో ఈనెల 20 నుంచి జూన్ 3 వ తేదీ వరకు నిర్వహించే టెట్ (టీచర్స్ ఎలిజిబిలిటీ టెస్ట్)పరీక్షకు హాజరయ్యే అభ్యర్థులకు మెలకువలు తెలియజేసేందుకు టి-సాట్ ప్రత్యేక ప్రసార కార్యక్రమాన్ని ఏర్పాటు చేసిందని టి.సాట్-సాఫ్ట్ నెట్ సీఈవో బోదనపల్లి వేణుగోపాల్ రెడ్డి తెలిపారు. ఈనెల 15 నుంచి నాలుగు రోజులపాటు ఐదు సబ్జెక్టులపై అనుభవంగల ఉపాధ్యాయులచే ప్రత్యేక లైవ్ కార్యక్రమం ఏర్పాటు చేశామని మంగళవారం విడుదల చేసిన ఒక ప్రకటనలో తెలిపారు. టి-సాట్ నిపుణ చానల్‌లో ఉదయం 11 నుంచి 12 గంటల వరకు పరీక్షకు హాజరయ్యే అభ్యర్థులకు మెలకువలతోపాటు సలహాలు, సూచనలు ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు. 15న సైకాలజీ, 16న టీచింగ్ మెథడ్స్, 17న తెలుగు, 18న ఫిజికల్ సైన్స్, మ్యాథ్స్ సబ్జెక్టులపై కొనసాగే ప్రసారాలు నిపుణ చానల్‌లో, టి-సాట్ విద్యా చానల్‌లో మరుసటి రోజు సాయత్రరం 5 నుంచి 6 గంటల వరకు పునఃప్రసారమవుతుందన్నారు. ఇప్పటికే టెట్ అభ్యర్థుల కోసం సుమారు 200 ఎపిసోడ్స్ టి-సాట్ డొమైన్‌లో అందుబాటులో ఉన్నాయన్నారు. అభ్యర్థులు తమ సందేహాలు, సమాధానాల కోసం 040-3540326/726, టోల్ ఫ్రీ నెంబర్ 1800 425 4039 నంబర్లకు కాల్ చేయవచ్చన్నారు.

శాఖలవారీగా ఖాళీలను గుర్తించని ప్రభుత్వం



ఖాళీల వివరాల పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న బక్క, జడ్సన్, పృథ్వీరాజ్, విఠల్ తదితరులు

పంజాగుట్ట, మే 14 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడ్డాక జాబ్ క్యాలెండర్ ప్రకారం ఉద్యోగాలు భర్తీ చేస్తామన్నారు. శాఖల వారీగా ఎన్ని ఖాళీలు ఉన్నాయో కూడా నేటికీ గుర్తించలేదని వరంగల్, నల్లగొండ, ఖమ్మం నియోజకవర్గం పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి బక్క జడ్సన్ ఆరోపించారు. మంగళవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో తెలంగాణ ఉద్యమకారులు పృథ్వీరాజ్, విఠల్, తదితరులతో కలిసి 2023 డిసెంబర్ 31 నాటికి ప్రభుత్వ విభాగాల్లో ఖాళీగా ఉన్న పోస్టుల వివరాల పోస్టర్‌ను ఆవిష్కరించారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నీళ్లు, నిధులు, నియామకాల పేరుతో ఏర్పడ్డ తెలంగాణలో నేటికీ అవి పూర్తి కాలేదన్నారు. శాఖల వారీగా ఖాళీలు గుర్తించలేదన్నారు. తాను ఎమ్మెల్సీగా గెలిచిన తర్వాత ఖాళీలు భర్తీ చేసే వరకు పోరాటం చేస్తామన్నారు.

కాంగ్రెస్‌కు క్రాస్ ఓటింగ్ భయం

- బీజేపీకి మైనారిటీ ఓట్లు మైనస్
- ఆశలు వదిలేసుకున్న బీఆర్ఎస్
- అయినా గెలుపుపై మూడు పార్టీల అభ్యర్థుల ధీమా
- మహేశ్వరంలో ఇదీ పరిస్థితి



సరూర్‌నగర్, మే 14 (ఆంధ్రజ్యోతి): చేవెళ్ల పార్లమెంట్ నియోజకవర్గం పరిధిలోని మహేశ్వరం అసెంబ్లీ సెగ్మెంట్‌లో 'మెజారిటీ ఎవరికి?' అనే అంశంపై స్థానికంగా చర్చలు జరుగుతున్నాయి. కాంగ్రెస్, బీజేపీ గెలుపుపై ధీమాగా ఉండగా.. బీఆర్ఎస్ గెలుపుపై ఆశలు వదిలేసుకున్నట్లు ప్రచారం జరుగుతోంది. ఆ పార్టీ ఓటు బ్యాంకు పరోక్షంగా బీజేపీ వైపు మళ్లినట్లు తెలుస్తోంది. ఇది బీజేపీకి లాభం చేకూరే అంశంగా మారింది. కాంగ్రెస్‌కు క్రాస్ ఓటింగ్ భయం పట్టుకున్నట్టు విశ్వసనీయంగా తెలిసింది. సొంత పార్టీలోని కొందరు ద్వితీయశ్రేణి నేతలతో పాటు ఇంకొందరు పెద్ద నాయకులు సైతం పూర్తి స్థాయిలో పని చేయలేదని, మొక్కుబడిగా ప్రచారం నిర్వహించి చేతులు దులుపుకున్నారనే వ్యాఖ్యలు వినిపిస్తున్నాయి. దాంతో కాంగ్రెస్‌కు ఓటింగ్ తగ్గి బీజేపీకి పెరిగి ఉంటుందని పరిశీలకులు భావిస్తున్నారు.

మహేశ్వరం నియోజకవర్గంలో జల్‌పల్లి, బాలాపూర్, పహాడిషరీఫ్, కొత్తపేట్, ఎర్రకుంట, షాహీన్‌నగర్, షరీఫ్‌నగర్ తదితర ప్రాంతాలలో ముస్లిం మైనారిటీ ఓట్లు తమకు గంపగుత్తగా పడ్డాయని, గడ్డం రంజిత్ రెడ్డికి ఇక్కడ మెజారిటీ ఖాయమని కాంగ్రెస్ నేతలు ధీమా వ్యక్తం చేస్తున్నారు. మైనారిటీ ఓట్లు తమకు మైనస్సేనని, అందుకే మైనారిటీయేతర ఓటు బ్యాంకుపై గురి పెట్టామని బీజేపీ నేతలు చెబుతున్నారు. 'ముస్లింలంతా కాంగ్రెస్‌కు మద్దతు ఇవ్వండి'.. అంటూ ఎన్నికలకు రెండు రోజుల ముందు ఒవైసీ ఇచ్చిన పిలుపు ఓ విధంగా బీజేపీకి లాభించిందని విశ్లేషకులు అంటున్నారు. ఆయన పిలుపుతో ముస్లిమేతరులు బీజేపీకి మద్ధతు ఇచ్చినట్టుగా పరిస్థితులు కనిపించాయని వారంటున్నారు. మరోవైపు.. ఒక దశలో కాంగ్రెస్‌కు ఓటు వేద్దామనుకున్న బీఆర్ఎస్ ఓటర్లు సైతం.. ఒవైసీ పిలుపు నేపథ్యంలో హఠాత్తుగా మనసు మార్చుకుని బీజేపీ వైపు మళ్లినట్టు తెలుస్తోంది. ఈ నేపథ్యంలో మహేశ్వరం నియోజకవర్గంలో బీజేపీకే ఆధిక్యత రావచ్చని విశ్లేషకులు పేర్కొంటున్నారు.

బీజేపీకి ఓటు వేయించిన బీఆర్ఎస్ నేతలు?

మీర్‌పేట్, బడంగ్‌పేట్ కార్పొరేషన్లలో కొందరు బీఆర్ఎస్ నేతలు పరోక్షంగా బీజేపీకి మద్దతు ఇచ్చినట్టు ప్రచారం జరుగుతోంది. పోలింగ్ రోజున బీజేపీకి ఓటు వేయమని పలు బూత్‌ల వద్ద బహిరంగంగా ప్రచారం చేసినట్టు స్థానికులు చెబుతున్నారు. పోలింగ్ రోజున ఆ పార్టీ బడా నేతలెవ్వరూ ఈ ప్రాంతంలో పర్యటించి పోలింగ్ సరళిపై వాకబు చేయకపోవడాన్ని బట్టి వారంతా గెలుపుపై దాదాపు ఆశలు వదిలేసుకుని ఉంటారని పరిశీలకులు వ్యాఖ్యానిస్తున్నారు. బీజేపీ అభ్యర్థి కొండా విశ్వేశ్వర్‌రెడ్డి ఆరు నెలల నుంచి చాపకింద నీరులా నిర్వహించిన ప్రచారం ప్రజల్లోకి బలంగా వెళ్లిందని, మరోపక్క ప్రధాని మోదీ చరిష్మా కూడా కలిసివచ్చే అవకాశమున్నదని అంటున్నారు.

మెజారిటీపై కాంగ్రెస్, బీజేపీ ధీమా

క్రాస్ ఓటింగ్, ముస్లిం ఓటు బ్యాంకు, బీఆర్ఎస్ వెనకడుగు లాంటి అంశాలను పక్కనబెడితే.. చేవెళ్ల పరిధిలోని ఏడు అసెంబ్లీ సెగ్మెంట్లలో కలిపి తమకు 40వేల ఓట్లకు తగ్గకుండా మెజారిటీ వస్తుందని, కచ్చితంగా తామే గెలుస్తామని కాంగ్రెస్ నేతలు ధీమా వ్యక్తం చేస్తున్నారు. రూరల్ నియోజవర్గాలతోపాటు అర్బన్ ప్రాంతాల్లోనూ ఆధిక్యత లభించనున్నదని, సీఎం రేవంత్‌రెడ్డి ప్రభుత్వం వంద రోజుల్లో అమలు చేసిన పలు సంక్షేమ, అభివృద్ధి పథకాలు గెలుపునకు దోహదపడే అవకాశమున్నదని ఆ పార్టీ నేతలు పేర్కొంటున్నారు. తమ ఓటు బ్యాంకు ఎటూ పోలేదని, దానికి ముస్లిం, క్రిస్టియన్ మైనారిటీ ఓటు బ్యాంకు సైతం తోడయిందని.. అవన్నీ కలిస్తే తామే గెలిచి తీరుతామని కాంగ్రెస్ నేతలు చెబుతున్నారు. బీజేపీ నేతలు మాత్రం.. ఏడు అసెంబ్లీ సెగ్మెంట్లలో స్పష్టమైన మెజారిటీ వస్తుందని, ఎక్కడా మెజారిటీ తగ్గదని బల్లగుద్ది చెబుతున్నారు. కేవలం ముస్లిం ఓటు బ్యాంకు ఒక్కటే తమకు ప్రతికూలాంశమని, మిగతా అన్ని అంశాలూ అనుకూలంగానే ఉన్నాయని, మెజారిటీ లక్ష ఓట్లకు తగ్గదని ఆ పార్టీ నేతలు ధీమా వ్యక్తం చేస్తున్నారు. కాంగ్రెస్, బీఆర్ఎస్ నుంచి జరిగిన క్రాస్ ఓటింగ్ మెజారిటీని మరింత పెంచనున్నదని వారంటున్నారు. ఈ రెండు పార్టీల మధ్యే ప్రధాన పోటీ నెలకొనడంతో బీఆర్ఎస్ నేతలు గెలుపుపై ఆశలు వదిలేసుకున్నారని స్థానికంగా ప్రచారం జరుగుతోంది.

బీజేపీ, కాంగ్రెస్ ఒక్కటేనని తాము ప్రజల్లో బాగా ప్రచారం చేశామని, ప్రభుత్వ వైఫల్యాలను ఎండగట్టామని, ముస్లిం, క్రిస్టియన్ మైనారిటీ ఓట్లు అధిక శాతం తమకే పడ్డాయని బీఆర్ఎస్ నేతలు పేర్కొంటున్నారు. కాంగ్రెస్, బీజేపీ తరఫున ఒకే సామాజిక వర్గానికి చెందిన అభ్యర్థులు పోటీలో ఉన్నందున సదరు సామాజిక వర్గం ఓట్లు చీలిపోయి.. బీసీ సామాజిక వర్గానికి చెందిన ఓటర్ల మద్ధతుతో తమ అభ్యర్థి గెలుస్తారని బీఆర్ఎస్ శ్రేణులు పేర్కొంటున్నాయి. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను ప్రజలు విశ్వసించడంలేదని, కేసీఆర్ పాలనే బాగుందని ప్రజలు నమ్ముతున్నారని, ఈ నేపథ్యంలో అన్ని వర్గాల ఓటర్లు తమనే ఆదరించారని బీఆర్ఎస్ నేతలు చెబుతున్నారు. తమ పార్టీ అభ్యర్థి నాలుగైదు వేల ఓట్ల ఆధిక్యతతో గెలుస్తారని అంటున్నారు. మొత్తంమీద ఎవరి ధీమా వారికి ఉన్నప్పటికీ.. చివరాఖరుకు ఎవరు గెలుస్తారన్నది జూన్ 4న జరిగే కౌంటింగ్ రోజే వెల్లడి కానున్నది. అప్పటిదాకా ఆయా పార్టీల అభ్యర్థులు ఓటరు జాబితాలను పక్కనపెట్టుకుని కూడికలు, తీసివేతలు చేసుకుంటూ తృప్తి పడాల్సిందే.!

అభ్యర్థుల భవితవ్యం ఈవీఎంలలో నిక్షిప్తం

స్ట్రాంగ్‌రూమ్‌లో భద్రపరిచిన అధికారులు

ఎల్‌బీనగర్, మే 14 (ఆంధ్రజ్యోతి): లోక్‌సభ ఎన్నికల పోలింగ్ ముగిసింది. అభ్యర్థుల భవితవ్యం ఈవీఎంలలో నిక్షిప్తమై ఉంది. మల్కాజిగిరి లోక్‌సభ పరిధిలో ఎల్‌బీనగర్ సెగ్మెంట్‌లో పోలింగ్ ముగిసిన తర్వాత కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్ల మధ్య ఈవీఎంలను సరూర్‌నగర్ ఇండోర్ స్టేడియంలోని స్ట్రాంగ్‌రూంలకు తరలించారు. స్ట్రాంగ్‌రూంకు సీసీ కెమరాల నిఘాతో సీఆర్‌పీఎఫ్ భద్రత ఏర్పాటు చేశారు. ఎల్‌బీనగర్ సెగ్మెంట్ అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారి పంకజ పర్యవేక్షణలో రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో ఈవీఎంలను స్ట్రాంగ్‌రూమ్‌లో భద్రపరిచి సీలు వేశారు.



ఏజెంట్ల సమక్షంలో ఈవీఎంలను భద్రపర్చిన స్ట్రాంగ్ రూంకు తాళం వేసిన ఏఆర్వో పంకజ, ఇతర అధికారులు

కౌంటింగ్‌కు 28 టేబుల్స్ ఏర్పాటు

జూన్ 4వ తేదీన ఓట్ల లెక్కింపుకోసం సరూర్‌నగర్‌స్టేడియంలో 28 టేబుల్స్ ఏర్పాటు చేయనున్నారు. ఓట్ల లెక్కింపునకు అవసరమైన ఏర్పాట్లలో అధికారులు నిమగ్నమయ్యారు. మల్కాజిగిరి లోక్‌సభ నియోజకవర్గం బరిలో ఉన్న అభ్యర్థుల తరఫున 28 మంది ఏజెంట్లతోపాటు అభ్యర్థి, ఎలక్షన్ ఏజెంట్‌లను తప్ప మరెవరినీ లెక్కింపు కేంద్రంలోకి అనుమతించరు. ఏజెంట్లు ఓట్ల లెక్కింపు టేబుల్ వద్ద కూర్చొని పరిశీలించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు.

అబ్దుల్లాపూర్‌మెట్‌లో 60.22 శాతం పోలింగ్

అబ్దుల్లాపూర్‌మెట్, మే 14 (ఆంధ్రజ్యోతి): సోమవారం జరిగిన లోక్‌సభ ఎన్నికల్లో అబ్దుల్లాపూర్‌మెట్ మండలంలో 60.22 శాతం పోలింగ్ నమోదయింది. మండలంలో మొత్తం 1,78,188 మంది ఓటర్లు ఉన్నారు. పురుషులు-90281, మహిళలు-87,877, ఇతరులు-30 మంది ఉన్నారు. మొత్తం 1,07,303 ఓటర్లు ఓటు హక్కును వినియోగించుకున్నారు.

జాతీయ పార్టీల అభ్యర్థులవైపే ఓటర్ల మొగ్గు?

ఇబ్రహీంపట్నం నియోజకవర్గంలో నాలుగు మండలాలతో పోలిస్తే అబ్దుల్లాపూర్‌మెట్ మండలంలోనే అత్యధికంగా ఓట్లు ఉన్నాయి. భువనగిరి నుంచి చామల కిరణ్‌కుమార్‌రెడ్డి(కాంగ్రెస్), బూర నర్సయ్యగౌడ్ (బీజేపీ), క్యామ మల్లేష్ (బీఆర్ఎస్) పోటీలో ఉన్నారు. పార్లమెంట్ నియోజకవర్గంతోపాటు అబ్దుల్లాపూర్‌మెట్ మండలంలో బీసీ ఓట్లు ఎక్కువగా ఉన్నాయి. ఆయా పార్టీలు బీసీ ఓట్లపై ప్రత్యేక దృష్టి పెట్టాయి. జాతీయ పార్టీల అభ్యర్థులవైపే మండలంలో ఓటర్లు మొగ్గు చూపినట్లు తెలుస్తోంది. కాంగ్రెస్, బీజేపీ నాయకులు పోటీపడి ఓట్లు వేయించుకోవడంలో సఫలం అయినట్లు తెలిసింది. బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు ఓటర్లను పట్టించుకోలేదని విమర్శలు వినిపించాయి. దీనికి తోడు పోలింగ్ జరుగుతున్న సమయంలోనే బీఆర్ఎస్ ఓట్లను బీజేపీకి మళ్లిస్తున్నారని ఆయా గ్రామాల్లో పెద్ద ఎత్తున ప్రచారం జరిగింది. దీంతో కాంగ్రెస్ నేతలు ఆందోళనకు గురైనట్లు తెలిసింది. పోటీ కాంగ్రెస్, బీజేపీ మధ్యనే ఉంటుందని పలువురు మాట్లాడుకుంటున్నారు. బీసీ ఓటర్లు ఎక్కువగా ఉన్న గ్రామాల్లో బీజేపీ అభ్యర్థి బూర నర్సయ్యగౌడ్‌కు గంప గుత్తగా ఓట్లు పడ్డాయనే ప్రచారం కూడా జరుగుతోంది. బీఆర్ఎస్‌తో పాటు కాంగ్రెస్‌లోని బీసీ ఓట్లు బూర నర్సయ్యగౌడ్‌కు క్రాస్ అయినట్లు మండలంలో అనుకుంటున్నారు. బూర నర్సయ్యగౌడ్ గెలుపు ఖాయం అంటూ బీజేపీ నాయకులు ఆశాభావం వ్యక్తం చేస్తుండగా, చామల కిరణ్‌కుమార్ గెలుపు ఖాయమని కాంగ్రెస్ నాయకులు ధీమా వ్యక్తం చేస్తున్నారు. భువనగిరి ఖిల్లాపై ఎవరి జెండా ఎగురవేస్తారో జూన్ 4 తేదీ వరకు వేచి చూడాల్సిందే.

ఈదుల చెరువు ఎఫ్‌టీఎల్ కబ్జా

- మట్టితో పూడ్చివేత
- కొనసాగుతున్న ప్రహరీ నిర్మాణం
- పట్టించుకోని ఇరిగేషన్ విభాగం అధికారులు

అబ్దుల్లాపూర్‌మెట్, మే 14 (ఆంధ్రజ్యోతి): పెద్దఅంబర్‌పేట్‌లో ఈదుల చెరువు కబ్జాకు గురవుతోంది. అధికారులు ఎన్నికల విధుల్లో నిమగ్నమై ఉండడంతో ఇదే అదునుగా భావించిన కొందరు అక్రమార్కులు యథేచ్ఛగా చెరువు ఎఫ్‌టీఎల్ ఆక్రమణకు పాల్పడుతున్నారు. వారం పది రోజులు నుంచి చెరువు ఎఫ్‌టీఎల్ పరిధిని మట్టితో పూడ్చి వేస్తున్నారు. రాత్రికి రాత్రి ప్రహరీ నిర్మాణ పనులు చేస్తున్నారు. కొంతమంది స్థానికులు అక్రమార్కులకు సహకరిస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.



చెరువును మట్టితో పూడుస్తున్న దృశ్యం

అధికారుల పర్యవేక్షణ కరువు

చెరువు, కుంటల కబ్జాలపై కఠిన చర్యలు తీసుకోవాలని ప్రభుత్వం ఇరిగేషన్, రెవెన్యూ శాఖల అధికారులకు ఆదేశాలు జారీ చేసినా పెడచెవిన పెడుతున్నారు. అధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో అబ్దుల్లాపూర్‌మెట్‌లో చెరువు, కుంటలు కబ్జా అవుతున్నాయి. పెద్దఅంబర్‌పేట్‌లో సుమారు 130 ఎకరాల్లో ఈదుల చెరువు విస్తరించి ఉంది. మునగనూర్, తొర్రూర్‌తోపాటు పై కాలనీల నుంచి వచ్చే వరద నీటితో చెరువు కళకళలాడుతుంది. వందల ఎకరాల పంట పొలాలకు నీరందిచడంతోపాటు మత్స్యకారులకు ఆర్థిక వనరుగా ఉపయోగపడుతుంది. ఇప్పటికే సుమారు ఒక ఎకరం స్థలాన్ని మట్టితో నింపేశారు. ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్ హద్దులు లేకుండా చెరిపేశారు. ఎఫ్‌టీఎల్ పరిధిని దాటి నిర్మాణ పనులు చేస్తున్నారు. ఇంత జరుగుతున్నా ఇరిగేషన్, రెవెన్యూ అధికారులు పట్టించుకోవడం లేదని పలువురు స్థానికులు ఆరోపిస్తున్నారు. ఆయా శాఖల అధికారుల సమన్వయలోపాన్ని కబ్జాదారులు వరంగా మార్చుకుంటున్నారు. చెరువు, కుంటల కబ్జాలపై ఇరిగేషన్ శాఖ అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని పలువురు ఆరోపిస్తున్నారు. ఆయా శాఖల్లోని కొంతమంది అధికారులు కబ్జాదారులకు కొమ్ముకాస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. చెరువు నలుమూలల కబ్జా చేస్తున్నారని స్థానికులు అంటున్నారు. అధికారులు పట్టించుకోకపోతే చెరువు పూర్తిగా కనుమరుగయ్యే ప్రమాదం ఉన్నదని రైతులు, మత్స్యకారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కబ్జాదారుల నుంచి ఈదుల చెరువును కాపాడాలని కోరుతున్నారు.

రద్దీలేని వేళల్లో రాయితీ ఎందుకు?

- కాంటాక్ట్ లెస్ కార్డులపై ప్రయాణికుల పెదవి విరుపు
- 10 శాతం మంది కూడా వినియోగించుకోని పరిస్థితి

హైదరాబాద్ సిటీ, మే 14 (ఆంధ్రజ్యోతి): మెట్రో రైళ్లలో రాయితీలను నామమాత్రంగానే అమలు చేస్తున్నారు. పేరు కోసం కొన్ని డిస్కౌంట్లను ప్రకటిస్తున్నప్పటికీ.. అవి అందరికీ ఉపయోగపడని పరిస్థితి నెలకొంది. దీంతో ఎల్ అండ్ టీ అధికారుల తీరుపై ప్రయాణికులు పెదవి విరుస్తున్నారు. అన్ని వేళల్లో కొనసాగించాల్సిన రాయితీలను కొన్ని గంటల వరకే పరిమితం చేయడంపై విమర్శిస్తున్నారు. మెట్రో రైళ్లలో ప్రయాణికుల సంఖ్య రోజురోజుకు పెరిగిపోతోంది. మూడు నెలల క్రితం రోజుకు 4.50 లక్షల మంది ప్రయాణించగా.. నెలన్నర రోజులుగా 4.80 లక్షల నుంచి 5.10 లక్షల మంది గరిష్ఠంగా రాకపోకలు సాగిస్తున్నారు. దీంతో రైల్వేస్టేషన్లు, రైళ్లలో ఎప్పుడు చూసినా రద్దీ కనిపిస్తోంది. రద్దీకి అనుగుణంగా అధికారులు 3 నిమిషాలకోసారి రైళ్లను నడిపిస్తున్నారు. ప్రయాణికుల సంఖ్య క్రమేపీ పెరుగుతున్నప్పటికీ.. వీలైనన్ని ఎక్కువ ఆఫర్లను అందుబాటులోకి తీసుకురావాల్సిన ఎల్ అండ్ టీ.. ఉన్న వాటిని కూడా పూర్తిస్థాయిలో అందించకపోతుండడంతో నిరసనలు వ్యక్తమవుతున్నాయి.

ఉపయోగపడని కాంటాక్ట్ లెస్ కార్డులు

పెరుగుతున్న ప్రయాణికులను ఆకట్టుకునేందుకు ఎల్ అండ్ టీ సంస్థ పలు రకాల ఆఫర్లను అందుబాటులోకి తీసుకొచ్చింది. ఇందులో భాగంగా స్మార్ట్‌కార్డు, సూపర్ సేవర్ ఆఫర్(ఎస్ఎస్ఓ)- 59 డిస్కౌంట్, కాంటాక్ట్ లెస్ కార్డ్(సీఎస్‌సీ) కార్డులను ప్రవేశపెట్టింది. ఉదయం 6 నుంచి 8 గంటల వరకు, రాత్రి 8 నుంచి 11 గంటల వరకు(నాన్ పీక్ అవర్స్‌లో) కాంటాక్ట్ లెస్ కార్డుల ద్వారా చేసే బుకింగ్స్‌పై 10 శాతం రాయితీ అందిస్తున్నారు. సదరు ఆఫర్‌ను కేవలం 10 శాతం మంది మాత్రమే వినియోగిస్తుండగా.. 90 శాతం మంది దూరంగా ఉంటున్న పరిస్థితి కనిపిస్తోంది. పీక్ అవర్స్(ఉదయం 9 నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు, సాయంత్రం 4 నుంచి 9 గంటల వరకు)లో కాంటాక్ట్ లెస్ కార్డులను అమలుచేస్తే అందరికీ ప్రయోజనం ఉంటుందని, రద్దీ లేని సమయంలో రాయితీ ఇవ్వడం ద్వారా ఎవరికీ ఉపయోగం ఉండదని ప్రయాణికులు వాపోతున్నారు.

పీక్ అవర్స్‌లోనూ కొనసాగించాలి..

పెరుగుతున్న రద్దీని దృష్టిలో ఉంచుకుని పీక్ అవర్స్‌లోనూ ఆఫర్లను కొనసాగించాలని ప్రయాణికులు కోరుతున్నారు. ప్రధానంగా 10 శాతం రాయితీతో కూడిన కాంటాక్ట్ లెస్ కార్డులను అన్నివేళల్లో అమలు చేయడం ద్వారా చాలా మంది వినియోగించుకుంటారని చెబుతున్నారు. ఈ ఏడాది ఏప్రిల్ 1 నుంచి సూపర్ సేవర్-59, స్మార్ట్ కార్డు, కాంటాక్ట్ లెస్ కార్డుపై 10 శాతం, డిజిటల్ క్యూఆర్ టికెట్స్‌పై ఉన్న 10 శాతం రాయితీ ఎత్తివేయడంతో ప్రయాణికుల నుంచి నిరసనలు వెల్లువెత్తాయి. మే 1 నుంచి ఆయా ఆఫర్లను కొనసాగిస్తామని అధికారులు ప్రకటించడం గమనార్హం.

పూజ చేస్తుండగా మంటలంటుకొని వృద్ధురాలి మృతి

చాదర్‌ఘాట్, మే 14 (ఆంధ్రజ్యోతి): ఇంట్లో పూజ చేస్తుండగా ప్రమాదవశాత్తు మంటలంటుకుని వృద్ధురాలు మృతి చెందింది. మలక్‌పేట ఎస్ఐ నవీన్ తెలిపిన వివరాల ప్రకారం.. మలక్‌పేట శ్రీపురం కాలనీలో నివసిస్తున్న వైవీకే రాజేశ్వరి(72) మంగళవారం ఉదయం పూజ చేస్తుండగా మంటలంటుకున్నాయి. పొరుగింటి వారు గమనించి బయటకు వెళ్లిన ఆమె భర్త భాస్కర రామారావుకు సమాచారం ఇచ్చారు. ఆయన వెంటనే ఇంటికి చేరుకోగా.. అప్పటికే రాజేశ్వరి కాలిన గాయాలతో అపస్మారక స్థితిలో ఉంది. ఆస్పత్రికి తరలించడానికి 108 అంబులెన్స్‌ను రప్పించారు. అంబులెన్స్ సిబ్బంది పరిశీలించి మృతి చెందినట్లు నిర్ధారించారు. మలక్‌పేట పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ప్రైవేట్ ట్రావెల్స్ బస్సులు ఢీకొని ఇద్దరు..

అబ్దుల్లాపూర్‌మెట్, మే 14 (ఆంధ్రజ్యోతి): వేర్వేరు ప్రాంతాల్లో ప్రైవేటు ట్రావెల్స్ బస్సులు ఢీకొని ఇద్దరు వ్యక్తులు మృతి చెందారు. అబ్దుల్లాపూర్‌మెట్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. బాటసింగారం శివారు చాచా దాబా సమీపంలో విజయవాడ జాతీయ రహదారిపై గుర్తుతెలియని వ్యక్తి సోమవారం అర్ధరాత్రి రోడ్డు దాటుతున్నాడు. అదే సమయంలో హైదరాబాద్ నుంచి విజయవాడ వైపు వేగంగా వెళ్తున్న ప్రైవేటు ట్రావెల్స్ బస్సు అతడిని ఢీకొట్టింది. తీవ్రంగా గాయపడిన అతడు అక్కడికక్కడే మృతి చెందాడు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా ఆస్పత్రికి తరలించారు. మృతుడి శరీరంపై నీలం రంగు చొక్కా, డార్క్ బ్లూకలర్ ప్యాంటు ఉన్నాయన్నారు. మృతుడి వివరాలు తెలియరాలేదు.

మరో ఘటనలో..

పసుమాముల కళానగర్‌కు చెందిన రేవెళ్ల జంగయ్య(40) ఆటో డ్రైవర్. మంగళవారం పనిమీద అబ్దుల్లాపూర్‌మెట్ వెళ్లాడు. విజయవాడ జాతీయ రహదారిపై మయూరి కాంట వద్ద రోడ్డు దాటుతుండగా హైదరాబాద్ నుంచి విజయవాడ వైపు వేగంగా వెళ్తున్న ప్రైవేట్ ట్రావెల్ బస్సు అతడిని ఢీకొట్టింది. తీవ్రంగా గాయపడిన అతడిని చికిత్స నిమిత్తం స్థానికంగాగల ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో చికిత్స పొందుతూ మధ్యాహ్నం మృతి చెందాడు. అబ్దుల్లాపూర్‌మెట్ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

రోడ్డు ప్రమాదంలో..

ఎంబీటీ అధికార ప్రతినిధికి తీవ్రగాయాలు

చాదర్‌ఘాట్, మే 14 (ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో ఎంబీటీ అధికార ప్రతినిధి తీవ్రంగా గాయపడ్డాడు. మలక్‌పేట యశోద ఆస్పత్రిలో చికిత్స పొందుతూ బంధువు మృతిచెందడంతో ఎంబీటీ అధికార ప్రతినిధి మంగళవారం ద్విచక్రవాహనంపై ఆస్పత్రికి వెళ్లారు. తిరిగి ఇంటికి వెళ్తుండగా చంచల్‌గూడ జైలు వద్ద నిర్మాణంలో ఉన్న స్టీల్ బ్రిడ్జి వద్ద ఇనుపరాడ్ తగలడంతో అదుపు తప్పి కిందపడిపోవడంతో తలకు, కుడి చేతికి తీవ్రమైన గాయాలయ్యాయి. వెంటనే మలక్‌పేట యశోద ఆస్పత్రికి తరలించారు.

బొట్టు బిళ్లలతో మూడు భాషల్లో జై శ్రీరామ్



మూడు భాషల్లో తయారు చేసిన శ్రీరామ్ బోర్డు

పంజాగుట్ట, మే 14 (ఆంధ్రజ్యోతి): జంటనగరాలకు చెందిన మహిళా కళాకారులు ఉమెన్ ఆర్టిస్ట్స్ అసోసియేషన్(డబ్ల్యూఏఏ)గా ఏర్పడ్డారు. బొట్టు బిళ్లలతో తెలుగు, ఇంగ్లిష్, హిందీ భాషల్లో జై శ్రీరామ్ బోర్డును అందంగా తీర్చిదిద్దారు. మంగళవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో డబ్ల్యూఏఏ సభ్యులు బొట్టుబిళ్లలతో రూపొందించిన జైశ్రీరామ్ బోర్డును ప్రదర్శించారు. ఈ సందర్భంగా జూబ్లీహిల్స్ రోడ్డు నంబర్ 10లోని కాసుల పద్మావతి చిత్రకళా అకాడమీ నిర్వాహకురాలు కాసుల పద్మావతి, కొండాపూర్‌కు చెందిన ఆర్ట్ టీచర్ సూర్యకుమారి, బేగంపేట హైదరాబాద్ పబ్లిక్ స్కూల్ ఆర్ట్ టీచర్లు యోగలక్ష్మి, ప్రతిభాదల్, తిరుమలగిరికి చెందిన డ్రాయింగ్ టీచర్ రజని మంచికంటి, సదాశివపేటకు చెందిన ఆర్ట్ టీచర్, రచయిత కోమలి బృందంగా ఏర్పడ్డారు. తమ ప్రాజెక్టుకు అయోధ్య అని పేరు పెట్టారు. గత నెల 19న 30 × 40 అంగుళాల బోర్డుపై తెలుగు, హిందీ, ఇంగ్లిష్ భాషల్లో బొట్టు బిళ్లలు ఉపయోగించి జై శ్రీరామ్ అని అందంగా రాశారు.

12 రోజుల పాటు రోజుకు ఐదు గంటలు వెచ్చించి బోర్డు పూర్తి చేశారు. దీనికి 32,970 బొట్టుబిళ్లలు వినియోగించారు. 16,314 నారింజ, 3,192 బ్లూ, 13,464 ఆకుపచ్చ బొట్టు బిళ్లలతో జైశ్రీరామ్ బోర్డును తీర్చిదిద్దారు. ప్రతిరూప కళాకారుడు డి.నాగేశ్వరరావు నుంచి ప్రేరణ పొంది రూపొందించినట్లు తెలిపారు. అయోధ్యకు వెళ్లి రామాలయం మ్యూజియంకు దీన్ని అందజేస్తామన్నారు.